క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సతీశ్

మొయినాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లిలో ఎంపీ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అంతర్గత రోడ్లు అభివృద్ధి చెందినప్పుడే పరిశుభ్రత ఉంటుందన్నారు. ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, గ్రామ ప్రత్యేకాధికారి అహ్మద్, చేవెళ్ల నియోజకవర్గ యువజన నాయకుడు నిరంజన్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో వర్షం



మొయినాబాద్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండతో ఉక్కపోతగా ఉండి సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం పడింది. మున్సిపాలిటీతో పాటు పెద్దమంగళారం, చిలుకూరు, అప్పోజీగూడ, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, ముర్తుజాగూడ, సురంగల్ గ్రామాల్లో వర్షం పడింది. దీంతో పనుల నుంచి ఇళ్లకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి మొయినాబాద్, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై నీళ్లు నిలిచి వాహనదారులు ఇబ్బందులుపడ్డారు.

పరామర్శ

షాబాద్: వరల్డ్ ఉమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ అధ్యక్షుడు జాకీర్ షరీఫ్ సతీమణి మెహ్రాజ్ ఉన్నీస (42) గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు గురువారం పోతుగల్ గ్రామంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, మహబూబ్‌నగర్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు తదితరులు ఉన్నారు.

ముందు జాగ్రత్తే మేలు

మంచాల: వరి పంటకు తెగులు సోకకుండా రైతులు తగిన జాగ్రతలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణలత దేవి అన్నారు. గురువారం మండల పరిధి మంచాల, లింగంపల్లిలో వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి గ్రామాల్లో (కె.ఎన్.ఎం.1638) వరి విత్తనాలను పంపిణీ చేశామని, ప్రస్తుతం ఆ పంట చేలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నామని వివరించారు. ఆ పంటలకు చీడపీడ, తెగులు సోకే ప్రమాదం ఉందని, ముందు జాగ్రత్తలు తీసుకోవడమే మేలన్నారు. రైతులు పండించిన పంట నుంచే విత్తనాలను తిరిగి తీసుకోవాలని సూచించారు.

ఏళ్ల కల.. నెరవేరనున్న వేళ

- నర్సప్పగూడ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం
- ఎమ్మెల్యే చొరవతో త్వరలో పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నర్సప్పగూడ వాగు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

నందిగామ: ఆ గ్రామం.. మండల కేంద్రమైన నందిగామకు కూతవేటు దూరంలో ఉంది.. కానీ వానొస్తే చాలూ.. రాకపోకలు ఏ క్షణాన నిలిచిపోతాయో తెలియని అయోమయ పరిస్థితి. కారణం ఏంటంటే గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న వాగు.. వాగుపై వంతెన సరిగా లేకపోవడంతో భారీగా వర్షం పడినప్పుడు రోడ్డుపై నీరు ప్రవహిస్తుంది. దీంతో గ్రామస్తులకు రాకపోకలు నిలిచిపోవడం ఖాయం. ఇదీ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలో వాగు పరిస్థితి.

40 ఏళ్ల క్రితం నిర్మాణం

మండల పరిధిలోని నర్సప్పగూడకు నందిగామ నుంచి 4 కిలో మీటర్ల దూరం ఉంటుంది. నందిగామ నుంచి అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ మీదుగా చేగూరు, వెంకమ్మగూడ, బుగ్గోనిగూడ, బండోనిగూడ, కన్హా తదితర గ్రామాలకు వెళ్లే రహదారి ఉంది. ఈ దారిలో అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ గ్రామాల మధ్యలో అక్కమ్మ చెరువుకు వరదనీరు వెళ్లే ప్రధాన వాగు ఉంది. ఈ వాగుపై సుమారు 40 ఏళ్ల క్రితం వంతెన నిర్మించారు. వర్షాలు పెద్దఎత్తున కురిసినట్లయితే నియోజకవర్గంలోనే అతిపెద్ద చెరువులలో ఒకటైన అక్కమ్మ చెరవుకు భారీ ఎత్తున వరదనీరు వస్తుంది. ఆ నీరు వంతెన మీదుగా పెద్దఎత్తున ప్రవహించే సమయంలో ఆ రహదారిని మూసివేస్తారు. దీంతో నందిగామ నుంచి నర్సప్పగూడకు వెళ్లాలంటే అటు కొత్తూరు మండలం తిమ్మాపూర్ నుంచి చేగూరు రోడ్డుపై నుంచి గానీ, లేదా కొత్తూరు పారిశ్రామికవాడ నుంచి తీగాపూర్ మీదుగా వెళ్లాల్సిన దుస్థితి. దీంతో ఆయా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

హెచ్‌ఎండీఏ నిధులు రూ.70 లక్షలు మంజూరు

నర్సాపూర్ గ్రామస్తులు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నందిగామ నుంచి నర్సప్పగూడ మీదుగా చేగూరుకు వెళ్లే సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చుతామని, వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయిస్తానని గతంలో గ్రామస్తులకు హామీనిచ్చారు. సింగిల్ రోడ్డును(పంచాయతీరాజ్ రోడ్డు) డబుల్ రోడ్డు(ఆర్అండ్‌బీ)గా మార్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసి ఇప్పటికే జిల్లా పరిషత్‌లో తీర్మానం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి గాను హెచ్‌ఎండీఏ నిధులు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. బ్రిడ్జి నిర్మాణం పనులు వీలైనంత త్వరలో ప్రారంభిస్తామని అధికారులు తెలపడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కృషితోనే..



నర్సప్పగూడ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం. గత కొన్నేళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం లభించనుండటంతో గ్రామస్తులందరూ సంతోషంతో ఉన్నారు.

– కావలి కృష్ణ, మాజీ సర్పంచ్, నర్సప్పగూడ

ఘనంగా బతుకమ్మ సంబురాలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

చేవెళ్ల: మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కాంచనలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని విభాగాలకు చెందిన మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పూల బతుకమ్మలను తయారు చేసి.. ఆటాపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి నిదర్శనంగా బతుకమ్మ నిలుస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ గ్రామ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి హామీనిచ్చారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. పాఠశాలకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు తప్పకుండా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్సీని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఈశ్వర్‌రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన కుమ్మరి రాములు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మాజీ ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు



రంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

చేవెళ్ల: మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో గురువారం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే, చేవెళ్ల మండల, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు వేర్వేరుగా వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు తాండురు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సుజాత



రావులపల్లిలో పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, వ్యవసాయాధికారులు

చేవెళ్ల: రైతులు నాణ్యమైన విత్తనాలు వేసి అధిక దిగుబడులు సాధించాలనే ఆలోచనతో వారిని ప్రోత్సహిస్తున్నట్లు రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.సుజాత అన్నారు. మండలంలోని కుమ్మెర, రావులపల్లి గ్రామాల్లో గురువారం వ్యవసాయ అధికారులతో కలిసి రైతులు వేసిన వరి, కంది, జొన్న పంటల క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతుల పంటలను పరిశీలించి మాట్లాడారు. క్యూస్‌ఈవీ కార్యక్రమంలో రైతులకు జూన్ నెలలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కంది, జొన్న, వరి విత్తనాలను అందించినట్లు తెలిపారు. ఆ విత్తనాలు వేసిన రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయని తెలుసుకునేందుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. ఆయా గ్రామాల్లో రైతులు వేసిన పంటలు బాగున్నాయని, మంచి దిగుబడులు వచ్చేలా ఉన్నాయని వెల్లడించారు. రైతులు సరైన వ్యవసాయ పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ బాలకోటేశ్వర్‌రావు, రైతులు వీరేశం, నరేందర్ తదతరులు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

షాద్‌నగర్: ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల సురేశ్ ఆధ్వర్యంలో నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య హాజరై దేవాలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దక్షిణ కాశీగా పిలవబడుతున్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ఆలయానికి రావడానికి భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి రాయికల్ నుంచి రామేశ్వరం వరకు రోడ్డు పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు ప్రశాంత్, హరిభూషణ్, ఇస్నాతి శ్రీనివాస్, గణేష్, ఎంకనోళ్ల వెంకటేశ్, దొడల వెంకటేశ్‌యాదవ్, కుర్మయ్య, వినోద్‌నాయక్, రంగన్నగౌడ్, కాసోజు శివ, అనిల్‌కుమార్‌గౌడ్, నర్సింహ, శివశంకర్, హన్మంత్, కృష్ణ, రాజునాయక్, లక్ష్మణ్‌చారి, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్ రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాంనగర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బాకారం జిల్లా పరిషత్ పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు కలిసి మండల కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలు తొలగించి, గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ విద్యనభ్యసిస్తారన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రధాని మోదీ దేశంలోని స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఓబీసీ కన్వీనర్ ఎల్గని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ శివారులో గల ఇండియన్ హైట్స్ పాఠశాల ఆవరణలో గురువారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎంఈఓ మనోహర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందడంతో పాటుగా మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతినిత్యం క్రీడల సాధనతో మేథోశక్తి పెంపొందుతుందని, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి పాఠశాలకు పీడీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఇండియన్ హైట్స్ స్కూల్ చైర్మన్ సజ్జల భువనేశ్వర్, ద్రాక్షాయిణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, అగ్గనూరి బస్వం, సీతారాం, రాయికల్ శ్రీనివాస్, నర్సింహారెడ్డి, ఖాదీర్, నర్సింలు, వ్యాయామ ఉపాధ్యాయులు బాలయ్య, రాజశేఖర్‌రెడ్డి, జగదీశ్, లక్ష్మణ్, అనిత, సంగీత, చంద్రశేఖర్, శ్రీలత, రవికుమార్, సుజాత, నర్మద, రాధిక తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

షాద్‌నగర్: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆరోపించారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ఎండీ.ఇబ్రహీం, రాయికల్ శ్రీనివాస్, శ్రీనునాయక్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?



బోడంపహాడ్ రోడ్డుపై గుంతలో నిలిచిన నీరు



గుంతలతో అధ్వానంగా హైతాబాద్ రోడ్డు

షాబాద్: మండల పరిధిలోని గ్రామాల రోడ్లు వర్షాలకు అధ్వానంగా మారాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులకు ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని హైతాబాద్, అంతారం నుంచి మన్‌మర్రి వరకు, మల్లారెడ్డిగూడ నుంచి ఎర్రోనిగూడ వరకు, రేగడిదోస్వాడ నుంచి బొబ్బిలిగామ వరకు, పోతుగల్ నుంచి మాచన్‌పల్లి వరకు గ్రామాల శివారులో తారురోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రమాదాలు జరిగితేనే పట్టించుకుంటారా అని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప



చేవెళ్ల: దేవునిఎర్రవల్లి పాఠశాలలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన ఐదు పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటప్ప అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం టీఎస్‌యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి.. ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. 30 నుంచి 40 సంవత్సరాల సర్వీస్ చేసిన ఉద్యోగికి రిటైర్డ్ అయిన తర్వాత పెన్షన్ లేకపోవటం అన్యాయమని ఆరోపించారు. సీపీఎస్, యూపీఎస్ విధానాలు కుటుంబానికి భద్రత కల్పించవని, ఓపీఎస్‌ను అమలు చేయాల్సిందేనన్నారు. జిల్లా కార్యదర్శి మహమ్మద్ అక్బర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. ఉపాధ్యాయులను తరగతి గదికే పరిమితం చేయాలని, వారికి ఇతర పనులు కేటాయించొద్దని అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా, మండల కమిటీ సభ్యులు అక్బర్, కిరణ్ మహేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, నర్సింలు తదితరులు ఉన్నారు.

పీఆర్సీని అమలు చేయాలి



కేశంపేట: కొండారెడ్డిపల్లి పాఠశాలలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న సంఘం నాయకులు

కేశంపేట: పీఆర్సీని అమలు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని వివిధ పాఠశాలలను టీఎస్‌యూటీఎఫ్ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి.. ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, వినీత్, చిన్నారావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ ఉదయ, అంగన్‌వాడీ టీచర్లు

సీడీపీఓ ఉదయ

షాద్‌నగర్‌రూరల్: పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ ఉదయ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్నారులకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాన్ని అందిస్తుందన్నారు. రోజు ఆహారంలో పాలు, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సంధ్యారాణి, దివ్య, వెంకటమ్మ, లక్ష్మీబాయి, అండాలు, జ్యోత్స్న, రేవతి, గీత, పద్మ, శివరాణి, జయలక్ష్మి, సమంత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.